క్లుప్తంగా

71 శాతం పింఛన్ల పంపిణీ



శివరామ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అముజూరి దేవి

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,713 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా మొదటి రోజు ఆదివారం 8,316 మందికి (71 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. అన్ని రకాల పింఛన్ల మొత్తం రూ.3,19,68,500 లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉండగా రూ.2,23,36,500 పంపిణీ చేసినట్టు తెలిపారు. సాంకేతిక ఇబ్బందులు, లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో నూరు శాతం పంపిణీ కాలేదని ఎంపీడీఓ తెలిపారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

పెద్దల నుంచే భావితరాలకు సంస్కృతీ, సంప్రదాయాలు



గ్రాండ్ పేరెంట్స్‌డేలో మాట్లాడుతున్న శేషారెడ్డి

బాలాజీచెరువు: ఆధునిక కాలంలో కనుమరుగవుతున్న సంస్కృతి సాంప్రదాయాలు కుటుంబ పెద్దల వల్లే భావితరాలకు కొనసాగుతూ ఉంటాయని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి పేర్కొన్నారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం గ్రాండ్ పేరెంట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ కుటుంబానికి రక్షణ కవచమని, వారి జీవిత అనుభవాలు పాఠాలుగా నేర్చుకుని అడుగుజాడల్లో నడిస్తే నేటి తరానికి అద్భుతమైన భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందన బోహ్రా, జేఎన్‌టీయూకే వీసీ సతీమణి అరుణ, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం

కాకినాడ రూరల్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం రక్తదాత ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్, ధర్మవరపు రాజశేఖర్, సిగిరెడ్డి రత్న కిశోర్‌లను అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇప్పటికి 132సార్లు రక్తదానం చేసినట్టు తెలిపారు. అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని‌పై మమకారంతో..





రెండు వందల నోటు, (అంతర చిత్రం) వెంకటేష్

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో రెండు వందల నోటు నిజమనుకునేరు! గాంధీజీపై మమకారంతో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ జోనల్ కార్యాలయ అటెండర్ రామకుర్తి వెంకటేష్ తన చేతి వేళ్లతో ఈ చిత్రాన్ని గీసి ఔరా అనిపిస్తున్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా జాతిపితపై అభిమానంతో ఈ చిత్రాన్ని గీశారు.

బాలయోగి సేవలు చిరస్మరణీయం

కరప: జిల్లా అభివృద్ధికి, టీడీపీకి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి పేర్కొన్నారు. ఆయన 78వ జయంతి సందర్భంగా ఆదివారం నడకుదురులో బాలయోగి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కాకినాడ సిటీ: ఏపీ 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెట్ల రాంబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో, జగనన్న సురక్ష కార్యక్రమంలో 104 ఉద్యోగులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. సీఎం చొరవ తీసుకుని ఆ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, 104 సేవలను ప్రభుత్వమే నిర్వర్తించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: గంగనాపల్లి రైల్వే ట్రాక్ సమీపంలో లే అవుట్ వద్ద గత నెల 26న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గరగ సతీష్‌కుమార్ (42) ఆదివారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సర్పవరం గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ రామమహేంద్రవరంలో హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. అప్పులు బాధలు తట్టుకోలేక గడ్డి మందును తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆస్పత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై దేవ సుధ తెలిపారు.

సందడిగా ఏక్ తారీఖ్-ఏక్ ఘంటే

- పాల్గొన్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనర్ నాగనరసింహారావు
- అందరి భాగస్వామ్యంతో పరిసరాల పరిశుభ్రత
- సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో స్వచ్ఛ సేవ



స్వచ్ఛ సేవలో పాల్గొన్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, కమిషనర్ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛత హీ సేవలో భాగంగా ఆదివారం ఏక్ తారీఖ్-ఏక్ ఘంటే కాకినాడలో సందడిగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యంతో చెరువులు ఉన్న ప్రాంగణాలలో సామూహిక పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో బోట్‌క్లబ్, అన్నమట్యాంక్ వద్ద జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా మాజీ చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. వారితో పాటు అక్కడకు వచ్చిన విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు స్వచ్ఛ సేవల్లో పాల్గొని అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్లో మూడు ప్రాంతాల చొప్పున ఎంపిక చేసి సుమారు 150 చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. కౌడా మాజీ చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రజల్లో కూడా చైతన్యం పెరిగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను గుర్తించి సమన్వయంతో పని చేసినప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతకు సహకరించాలి

కరప: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు సహకరించాలని ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా ఆదివారం నడకుదురులో ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలసి ఆయన స్వచ్ఛత దివస్ నిర్వహించారు. సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిడి బుచ్చిరాజు, పైలా గోవిందు, పోతల లోవప్రసాద్, కార్యదర్శి పీఎస్ఆర్ బ్రహ్మానందంలతో కలసి ఏక్ తారీఖ్ ఏక్ ఘంటే ఏక్ సాత్ నిర్వహించారు. ఈ మేరకు వారు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్ పారిశుద్ధ్య కార్మికులతో కలసి హైస్కూలు గ్రౌండ్ పారిశుద్ధ్య పనులు చేశారు. పీహెచ్‌సీలో సిబ్బందితో కలసి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ శ్రమదానం చేశారు. పాతర్లగడ్డలో సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, కార్యదర్శి బి.చంద్రకళ స్వచ్ఛ పనుల అనంతరం క్లాప్‌మిత్రలతో కలసి కాఫీ తాగారు.

ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వచ్ఛత హి సేవలో భాగంగా ఆదివారం పలు సంస్థల ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రత చేపట్టారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత చేపట్టారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పీజీ సెంటరు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ - 1 అధికారి డాక్టర్ ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొని శ్రమదానం చేశారు. రమణయ్యపేట కూరగాయలు మార్కెట్ వద్ద బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, గౌతు చెన్నారావు, అనపర్తి వెంకటేష్ తదితరులు చెత్తను శుభ్రం చేశారు.

స్ఫూర్తిదాయకంగా స్వచ్ఛ సేవ

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో స్వచ్ఛ సేవలు నిర్వహించారు. రంగరాయ అనుబంధ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం బోధకులతో కలసి రంగరాయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమాశంకర్ సహా వివిధ విభాగాల బోధకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో ఆర్ఎంవోలు అనిత, రాహుల్, యమున పర్యవేక్షణలో ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు.



నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అలాగే జీజీహెచ్‌లో దిశ వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శైలజ ఆధ్వర్యంలో కాకినాడ కచేరీ పేటలో స్వచ్ఛ సేవలు నిర్వహించారు. వన్ స్టాప్ బృందం ప్రవీణ సహా సిబ్బంది చీపుర్లతో అక్కడి ప్రాంగణాలను శుభ్రపరిచారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథపురంలోని నేతాజీ పార్కులో స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ పార్కులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. స్మార్ట్ సిటీ నిధులతో ఈ పార్కులో సదుపాయాలు కల్పించారని, అయితే రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారిందన్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రతి నెల ప్రతి ఒక్కరూ ఒక గంట పాటు శ్రమదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్, గౌతు చిన్న పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్న అధికారుల బృందం



సేవా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



నడకుదురులో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

ముంగిటకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- జ్యూవెల్ మెడోస్ వద్ద గడప గడపకూ..



అపార్టుమెంట్ల వాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమ పథకాలను గడప వద్దకు చేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట పంచాయతీ పరిధిలో సర్పవరం రోడ్డులో ఉన్న జ్యూవెల్ మెడోస్ గ్రేటెడ్ అపార్టుమెంట్ల సముదాయంలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. జ్యూవెల్‌మెడోస్ వెల్ఫేర్ అసోసియేషన్, సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో అపార్టుమెంట్ల వాసులు ఎమ్మెల్యే కన్నబాబుకు ఘన స్వాగతం పలికారు. ఉప్పునీటి సమస్యతో బాధ పడుతున్న తమకు నీరిచ్చిన భగీరథుడంటూ ఫ్లెక్సీలు వేసి స్వాగతించి, గజమాలతో సత్కరించారు. కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. కాలనీకి పార్కు నిర్మిస్తామని, డ్రైనేజీ సమస్య, ప్రమాదాలు జరగకుండా స్పీడు బ్రేకర్ల ఏర్పాటుపై అక్కడే ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎస్సై అజయ్ బాబులను ఆదేశాలు ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని, ఏ అవసరం వచ్చిన ముందుంటానని హామీ ఇచ్చారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టన విధంగా వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలనను అందిస్తున్నారన్నారు. అపార్ట్‌మెంట్ వాస్తవ్యుడు మరిడి రాజు వైఎస్సార్ సీపీలో చేరడంతో ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తహసీల్దార్ మురార్జీ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, సురేష్, అనుసూరి ప్రభాకర్, జ్యూవెల్ మెడోస్ అపార్టుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కంటేటి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు ఏఎస్‌వీ ప్రసాద్, సెక్రటరీ సత్తిబాబు, సిద్ధి వినాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు అడపా బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ పద్మశ్రీ
- స్వచ్ఛభారత్ అవార్డుల ప్రదానం
- పాల్గొన్న కమిషనర్, అధికారులు



ఎమ్మెల్సీ పద్మశ్రీ, నారాయణరావు దంపతులను సత్కరిస్తున్న నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: ప్రజల ఆరోగ్య సేవలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం స్వచ్ఛ భారత్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. స్వచ్ఛ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వం, క్లీన్ ఏపీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య, ఆరోగ్య సేవలు అందిస్తున్నాయన్నారు. కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ 2014లో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, వీటికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా మరిన్ని పథకాల ద్వారా పారిశుద్ధ్య నిర్వహణను సమర్థవంతంగా చేయగలుగుతున్నామన్నారు. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణలో దేశంలోనే రెండో స్థానంలో కాకినాడను నిలపగలిగామన్నారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య గృహ నిర్మాణ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ- పరిసరాల పరిశుభ్రతలో ఉత్తమ సేవలు అందిస్తున్న వివిధ వర్గాలను ఎంపిక చేసి స్వచ్ఛ భారత్ అవార్డులను ప్రదానం చేశారు. 14 సర్కిళ్ల కార్మికులతో పాటు శానిటరీ సెక్రటరీలు, ఉత్తమ హోటల్, ఉత్తమ పెట్రోల్ బంక్, ఉత్తమ ఆస్పత్రి తదితర సంస్థలను ఎంపిక చేసి అవార్డులను అందజేశారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఈఈ మాధవి, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎస్ఆర్ నిధులు ద్వారా సహకరిస్తున్న ఓఎన్‌జీసీ ప్రతినిధి డాక్టర్ రవీంద్ర ఆరికేటిని సత్కరించారు.

'పోషణ్ మా' సూపర్ సక్సెస్



పౌష్టికాహార ప్రయోజనాన్ని మహిళకు వివరిస్తున్న అంగన్వాడీ టీచర్ రమణమ్మ

- కాకినాడ ప్రాజెక్టు పరిధిలో 253 అంగన్వాడీ సెంటర్లలో నిర్వహణ
- లబ్ధి పొందిన వందలాది గర్భిణులు, బాలింతలు, చిన్నారులు



అంగన్వాడీ టీచర్ దయావతి సిద్ధం చేసిన 'మన పళ్లెంలో మన ఆరోగ్యం'

కాకినాడ ప్రాజెక్టు పరిధిలో ఇలా..

'పోషణ్ మా' జరిగిన రోజులు	30
సెక్టార్లు	9
అంగన్వాడీ కేంద్రాలు	253
పాల్గొన్న కార్యకర్తలు	252
హెల్పర్లు	237
సూపర్‌వైజర్లు	6
గర్భిణులు	2088
రక్తహీనత ఉన్న గర్భిణులు	339
ఆరేళ్ల లోపు బాలలు	17,631
పోషకాహార లోపం ఉన్న బాలలు	560

కాకినాడ క్రైం: 'పోషణ్ మా' పోషకాహార అవగాహన కార్యక్రమం అంచనాలకు మించి విజయవంతమైంది. కాకినాడ ప్రాజెక్టు పరిధిలో 253 అంగన్వాడీ కేంద్రాల భాగస్వామ్యంతో 9 సెక్టార్లలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత నెల 1న ప్రారంభమై నెలాఖరు వరకు కొనసాగి గర్భిణీలు, బాలింతలు, బాలలకు పోషకాహార దిక్సూచిగా నిలిచింది.

ఏం చేశారు..

పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్య భారతాన్ని నిర్మించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ మార్గనిర్దేశంలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం సాగింది. ఇన్‌చార్జి సీడీపీవో కొల్లి దయామణి పర్యవేక్షణలో గర్భిణులు, బాలింతల సంరక్షణకు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో టీచర్లు గృహ దర్శనాలు చేసి పోషకాహార ప్రాధాన్యాన్ని వివరించారు. వైద్య, ఆరోగ్యశాఖ సమన్వయంతో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, బాలలను గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు చేయించారు. కౌమర దశ బాలికల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా పాఠశాలల్లో అవగాహన కల్పించారు. మన పళ్లెంలో మన ఆరోగ్యం పేరుతో రోజువారీ తినాల్సిన పోషకాల జాబితాను వివరించి ఫుడ్ పిరమిడ్లు నిర్మించారు. సెక్టార్ల పరిధిలో సదస్సులు నిర్వహించి స్థానిక నాయకులు, అధికారుల సమక్షంలో ఆహార ప్రదర్శనలు చేపట్టారు.

స్వచ్ఛంద సంస్థల సహృదయం

రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణ తద్వారా మాతా, శిశు మరణాల నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు పాత్ర పోషించాయి. ఆరోగ్యకరమైన ప్రసవాన్ని ప్రోత్సహించేందుకు పౌష్టికాహార కిట్లు అందించాయి. కొనసాగింపుగా రాగంపేట సెక్టార్ పరిధిలో స్థానికులు, జగన్నాథపురం సెక్టార్ 1 పరిధిలో సూపర్‌వైజర్ ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హరీష్ స్పోర్ట్స్ అధినేత హరీష్ పోషణ్ మా వేదికగా 55 మంది గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు.

పోషకాహారం లోపిస్తే..



పోషకాహార లోపం వల్ల గర్భిణులు, బాలింతల్లో ఏర్పడే తొలి సమస్య రక్తహీనత. గర్భధారణ సమయంలో తల్లి శరీరంలోని రక్తంతోపాటు శిశువు దేహ నిర్మాణం కోసం కణజాలం, ఎముకల ఏర్పాటు బలోపేతానికి కాల్షియం, తల్లి నుంచే వినియోగం అవుతాయి. ఇవి తల్లిలో లోపిస్తే శిశువుకు కూడా లోపం ఏర్పడుతుంది. పోషకాహారం లోపిస్తే అలసట, నీరసం, తలనొప్పి, కాళ్ల నొప్పులు, తిమ్మిర్లు, ఆయాసం వస్తాయి. గర్భిణులకు గర్భస్రావం, బాలింతలకు పాలు పడకపోవచ్చు. పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో పుట్టడం, బిడ్డ పుట్టిన తర్వాత, పుట్టక ముందు ఎదుగుదల లోపించడం, పిండం సరిగా ఎదగకపోవడం, మెదడులో పెరుగుదల లేక మానసిక సమస్యలు తలెత్తడం పోషకాహార లోపం వల్లే వస్తాయి. పలు మాతా, శిశు మరణాలలో పోషకాహార లోపానిదే కీలక పాత్ర. బాలింతల్లో పోషకాహార లోపం బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తుంది. వారి వయసు ఎదుగుతున్న కొద్దీ ఎముకలు, కణజాల, రక్తహీనతకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ ఏఎల్ సత్యవతి, ప్రసూతి వైద్య నిపుణురాలు, కాకినాడ

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవం



నక్కావారి ఎస్సీవీధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం

కరప: వినాయక నిమజ్జనాలు ఆదివారం సైతం కోలాహలంగా సాగాయి. స్థానిక నక్కావారి ఎస్సీ వీధి, సీతమ్మ వీధి, జెడ్.భావారం, కొంగోడు తదితర గ్రామాల్లోని గణపతి పందిళ్ల వద్ద, వినాయక ఆలయాల వద్ద లడ్డూ ప్రసాదాలకు బహిరంగ వేలం నిర్వహించారు. జెడ్.భావారంలోని ఓసీ వీధి రామాలయంలో నిలిపిన గణపతి మండపం వద్ద లడ్డూ ప్రసాదాన్ని రెడ్డి ప్రసాద్ రూ.43 వేలకు పాడి దక్కించుకున్నారు. గొర్రిపూడి, వేములవాడ తుల్యభాగనదిలో, అరట్లకట్ట, పెనుగుదురు కెఎంజే పంటకాలువల్లో నిమజ్జనం చేశారు.

మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం కాకినాడ యూటీఎఫ్ భవనంలో కర్రి చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. కాకినాడలో నవంబర్‌లో జరగాల్సిన జాతీయ సమావేశాల ఏర్పాట్లను సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ బహుళ జాతి కంపెనీలు బ్యాంక్‌లతో మిలాఖత్ అయి సముద్రతీరాన్ని ముక్కలుగా చేసి 100 మీటర్ల లోతు వరకు కనిపించే నల్ల ఇసుక ఇల్మానైట్, మోనోసైట్, గార్నెట్ సహా 138 మిలియన్ రకాల ఖనిజ లోహాలు సున్నపురాయి, పగడపుదిబ్బలు వెలికి తీయనున్నారన్నారు. ఇది పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ సమావేశంలో జాతీయ మత్స్యకార నాయకులు కొల్లాటి శ్రీనివాస్, సీహెచ్ రమణి, తదితరులు పాల్గొన్నారు.

రఘుపతి వెంకటరత్నం జీవితం అందరికీ ఆదర్శం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని బ్రహ్మసమాజం అధ్యక్షుడు జవహర్ అన్నారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు 162వ జయంతి ఉత్సవాలను స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లో ఉన్న బ్రహ్మజ్ఞాన సత్సంగ్ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేస్తూ జీవితం గడపాలన్నారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందించారు. బ్రహ్మ సమాజం కార్యదర్శి మోకా పవన్‌కుమార్, సభ్యులు ఇందిర పాల్గొన్నారు.

స్వర్జన్‌రాజు భార్యకు డీజీ సునీల్ పరామర్శ



విజయలక్ష్మికి ధైర్యం చెబుతున్న డీజీ సునీల్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రంగరాయ వైద్య కళాశాల పీడీ, ఒలింపిక్ సంఘ కార్యదర్శి, అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు దివంగత డాక్టర్ కె.స్వర్జన్‌రాజు సతీమణి విజయలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీసెస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ ఆదివారం కాకినాడలోని స్వర్జన్‌రాజు స్వగృహంలో పరామర్శించారు. కాకినాడ లక్ష్మీ పరిణయ హాల్‌లో జరుగుతున్న సివైఎఫ్ యువజనోత్సవాలకు వచ్చిన ఆయన స్వర్జన్‌రాజు గృహానికి వచ్చి నివాళులు అర్పించారు. స్వర్జన్‌రాజు వంటి మిత్రుడని కోల్పోవడం తీరని లోటన్నారు. డీజీ సునీల్‌కు స్వర్జన్‌రాజు సోదరుడు వెస్లీ, కుంటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత దంత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఈశ్వర్‌నగర్‌లో ఉన్న వాత్సల్య వృద్ధుల సంక్షేమ ఆశ్రమంలో ఆదివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు, అపోలో నాగార్జున వృద్ధులకు పండ్లు అందించారు.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్, విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజును సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, అడబాల రత్నప్రసాద్, ఎస్వీ రమణారెడ్డి, రామకృష్ణ, శిరీష, రవిశంకర్ పట్నాయక్ తదితరులు సన్మానించారు.